క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానంలో పాల్గొన్న యువత

పార్వతీపురం: యువత రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని కర్షక మహర్షి హాస్పిటల్ డైరెక్టర్ డి.పృథ్వీమోహన్ అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా ఆస్పత్రిలో అభిమానులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకలను ఇలా అభిమానులు, స్నేహితుల నడుమ నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రక్తదానం శిబిరంలో సేకరించిన రక్తంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో డా.జి.ప్రభాకరరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



జేసీబీతో నది ఒడ్డున పిచ్చిమొక్కలను తొలగింప చేస్తున్న సర్పంచ్ దాసు

సీతానగరం: వర్షాలు విస్తారంగా కురవడం వల్ల మండలంలోని గ్రామాల్లో సువర్ణముఖి నది తీరాన రేవుల్లో పాములు, దోమల నివారణకు సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు బూర్జ వద్ద సువర్ణముఖి నదిలో ఉధృతంగా నీరు ప్రవహించడంతో ఎగువ ప్రాంతాల నుంచి పాములు వస్తున్నందున ముందు జాగ్రత్తచర్యగా జేసీబీ ద్వారా కొత్త బూర్జ, పాతబూర్జ నీలాటి రేవుల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను మంగళవారం తొలగించారు. ఇటీవలే నదిపరీవాహక ప్రాంతంలో ఉన్న పెదభోగిలి పంచాయతీ నీలాటి రేవుల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే దోమల నివారణకు ఎబెట్ దోమల నివారణమందు పిచికారీ చేయించారు.

సమస్యల పరిష్కారానికి డాక్టర్ల సమ్మె



రోగికి అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు

సీతానగరం: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధి కారులు సమ్మె చేస్తున్న కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పీహెచ్‌సీ వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వధిక సమ్మెచేస్తున్న కారణంగా రోగులకు ప్రత్యామ్నాయంగా సేవలందించనున్నట్లు డీఎంహెచ్‌ఓ భాస్కరరావు చెప్పారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి వైద్య సేవల నిమిత్తం వచ్చిన రోగులకు సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని కేసులను పరిశీలించిన అనంతరం వైద్యపరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలియ జేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షబీభత్సం



ఉధృతంగా ప్రవహిస్తున్న సువర్ణముఖినది

- పొంగిన గెడ్డలు, వాగులు
- చెట్లు విరిగి విద్యుత్‌సరఫరాకు అంతరాయం
- శరవేగంగా పనులు చేపట్టిన ట్రాన్స్‌కో అధికారులు



అడారుగెడ్డ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీటిని దాటుతున్న గిరిజనులు



కొండపేట వద్ద చెట్టువిరిగిపోవడంతో, నేల కొరిగిన విద్యుత్‌స్తంభం

మక్కువ: మండలంలో సోమవారం రాత్రి 7.30గంటలనుంచి, రాత్రి 10గంటల వరకు కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలి, వర్షం కురవడంతో వరదనీరు ఎక్కడికక్కడ ఉప్పొంగింది. స్థానిక బీసీకాలనీ, ప్రధానరహదారి, కన్నంపేట గ్రామం సమీపంలోని రహదారిపై వరదనీరు ప్రవహించడంతో, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే స్థానిక సువర్ణముఖినది, కవిరిపల్లి గ్రామం వద్ద గోముఖినది, దుగ్గేరు సమీపంలోని అడారుగెడ్డ ఉధృతంగా ప్రవహించాయి. గాలి, వర్షానికి కొండపేట గ్రామం వద్ద విద్యుత్‌స్తంభాలపై చెట్లుపడటంతో, విద్యుత్‌స్తంభాలు, వైర్లు నేల కొరిగాయి. సోమవారం రాత్రంతా శంబర, కొండ బుచ్చమ్మపేట, కొండపేట తదితర గ్రామాల్లో చీకటి అలుముకుంది. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది విద్యుత్ పనులు శరవేగంగా చేపట్టి మంగళవారం మధ్యాహ్నానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు.

ఘనంగా దుర్గా దేవికి యాగపూజలు



ఆటోస్టాండ్‌లో పూజలందుకుంటున్న దుర్గాదేవి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సీతానగరం: మండలంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు అర్చకులు దుర్గాదేవి మంటపాల్లో భక్తులతో అభిషేకాలు, హోమం, యాగపూజలు చేయించారు. బగ్గందొరవలస, చినభోగిలి, సీతానగరం, మిర్తివలస, గాదెలవలస గ్రామాల్లో హోమాలు జరిగాయి.

ఉధృతంగా సువర్ణముఖి నీటి ప్రవాహం

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదిలో ఉధృతంగా నీరు ప్రవహిస్తున్న కారణంగా ప్రమాదం పొంచి ఉన్నందున నదిఒడ్డునున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ సువర్ణముఖి నదికి ఎగువనున్న ఒడిశా ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తు న్నాయన్నారు. ఎగువ నుంచి నదిలో ప్రవేశించిన నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల కొత్తవలస నుంచి పెదంకలాం వరకు నదికి ఇరువైపులా ఉన్న తామరఖండి, గెడ్డలుప్పి, బుడ్డిపేట, లక్ష్మీపురం, బగ్గందొరవలస, అనంతరాయుడుపేట, బూర్జ ఆవాలవలస, చినంకలాం, చెల్లన్నాయుడువలస, జయంతిరాపురం, చినభోగిలి, అప్పయ్యపేట గ్రామాల ప్రజలు నదిలో దిగవద్దని, పశువులను దించవద్దన్నారు. ఇప్పటికే వీర్వోల ద్వారా గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని తెలియ జేసినట్లు చెప్పారు.

పీపీపీ లీజు విధానం రద్దుచేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలీ సంఘం, పీడీఎస్‌ఓ నాయకులు

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరుబాట
- రైతుకూలీ సంఘం, పీడీఎస్‌ఓ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం, విద్యార్థి సంఘం పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరు వర్మ మాట్లాడుతూ రాష్ట్ర కేబినెట్ 17 కొత్త వైద్య కళాశాలల్లో పార్వతీపురంతో సహా పదింటిని 33సంవత్సరాల పాటు ప్రైవేటుకు కట్టబెట్టాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఈ నిర్ణయంతో 1500 ఎంబీబీఎస్ సీట్లు ప్రైవేట్‌పరం అవుతాయని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కోటాను 50శాతానికి కుదించి మిగిలిన సీట్లను మార్కెట్ రేట్లకు అమ్ముకోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య, విద్య, అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు కె. సోమేష్, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయుడు మాట్లాడుతూ పీపీపీ విధానంలో ఎంబీబీఎస్ కోర్సుకు అయ్యే ఖర్చు అరకోటికి పైగా చేరుతుందని, ఇది ప్రభుత్వ కళాశాల ఫీజు కంటే పది రెట్లు అధికమన్నారు. కన్సెల్టెన్సీల ముసుగులో కళాశాలలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దీన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తూ విద్యార్థులు, యువత, మేధావులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీసంఘం నాయకులు మోనంగి భాస్కరరావు, విశ్వేశ్వరరావు, ప్రసాద్, అసిరి, పీడీఎస్‌ఓ నాయకులు, సురేష్, మున్న తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్.. కార్యకర్తలకు బ్రహ్మాస్త్రం

సీతానగరం:

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్ ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, బి. శ్రీరాములునాయుడు, పార్టీ విభాగం పీఆర్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. డిజిటల్ బుక్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ కార్యకర్తల మొబైల్‌లో అప్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలకుల దాష్టీకాలు రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్నాయని, సమాజానికి సేవలందించాల్సిన కొందరు ప్రభుత్వ అధికారులు పాలకులకు కొమ్ముకాస్తున్నారన్నారు. దీంతో న్యాయపరమైన సమస్యలతో కార్యకర్తలు గ్రామాల్లో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధినాయకత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని తెలియజేశారు. అన్యాయానికి గురైన వారు వెంటనే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి సమస్యకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, పార్టీ సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, బొన్నాడ తిరుపతిరావు, ఆర్వీ పార్థసారథి, శంకరావు వెంకటరమణ, వై.గోపాలనాయుడు, మోహన్ పాల్గొన్నారు.



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురంలో..

పార్వతీపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు రక్షణగా, భరోసాగా నిలిచేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన డిజిటల్ బుక్ జగనన్న 2.0 క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు తన కార్యాలయంలో పార్టీ పట్టణ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్‌షఫీ, పాత గౌరీశంకరరావు, దేవుపల్లి నాగరాజు, షేక్ జలాల్, కోల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: డిజిటల్ బుక్ జగనన్న 2.0 క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు

బలిజిపేటలో..



బలిజిపేట: పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించిన నాయకులు

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాదరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ ఏసు, వీవర్స్ మండల కన్వీనర్ నారాయణరావు, వి.సుబ్బారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల కొవ్వొత్తుల ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు

పార్వతీపురం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జిల్లా కేంద్రాస్పత్రి నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న సమ్మెకు దిగుతున్నట్లు తెలియజేశామని, 20ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న తమకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉన్నత విద్యాకోటాను అకారణంగా రద్దుచేసి తమ భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు అరకొర అలవెన్సులు, సంచార వైద్యులకు మూడేళ్లుగా టీఏ బకాయిలకు ప్రభుత్వం మొండిచేయి చూపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు కాకపోవడం, పీజీ కౌన్సెలింగ్‌లో అస్పష్టత, తమతో చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వంటి చర్యలతో సంవత్సర కాలంగా అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా తమ సమస్యలు పరిష్కారం జరిగేదెప్పుడు అంటూ ప్రభుత్వ తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు.

ఈ మేరకు తమ న్యాయబద్ధమైన హక్కుల సాధనకు నిరసన బాట పట్టినట్లు స్పష్టం చేశారు. కేవలం తమ సమస్యల పరిష్కారానికి నిరసన వ్యక్తం చేస్తున్నామని ప్రజలను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చామని, అనంతరం శుక్రవారం నుంచి ఆమరణ దీక్షలకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీహెచ్‌సీడీఏ నాయకుడు డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డా.తిరుమల ప్రసాదరావు, డా.శ్రీకాంత్‌లతోపాటు మరికొంతమంది పీహెచ్‌సీల వైద్యులు, వారికి మద్దతుగా ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పీఎం స్వనిధిని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు:

పీఎం స్వనిధి పథకాన్ని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీశిశు, గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మున్సిపల్‌కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పీఎం స్వనిధి పథకం లోక కళ్యాణ్ మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వీధి వ్యాపారులు ఆర్థిక సాధికారత సాధించడానికి ఈ పథకం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నకుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఐదుగురికి గాయాలు

పార్వతీపురం రూరల్:

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయాలపాలయ్యారు. కొమరాడ మండలం దంగభద్ర గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపగిన వారిలో పార్వతీపురానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించగా, మిగిలిన నలుగురు క్షతగాత్రులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని జిల్లా కేంద్రాస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపారు.

పాఠశాలకు ముళ్ల కంపలే గేట్లు



గదబ కరకవలస ప్రాథమిక పాఠశాలకు గేట్లు లేక కపంలు అడ్డుపెట్టిన దృశ్యం

సాలూరు రూరల్: మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలకు కూటమి ప్రభుత్వం ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే ఆదరా బాదరాగా కూటమి కార్యకర్తలే కాంట్రాక్టర్ల అవతారమెత్తి ప్రహరీల నిర్మాణం చేపట్టారు. చాలావరకు ఈ ప్రహరీల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొన్నిచోట్ల ప్రహరీ నిర్మాణాలు సగంలోనే నిలిచిపోగా మరికొన్ని పాఠశాలలకు ప్రహరీలు పూర్తయినా గేట్లు మాత్రం వేయలేదు. ఈ నేపథ్యంలో గదబకరకవలస ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మాణం పూర్తిచేసి గేట్లు వేయక పోడంతో దసరా సెలవులకు పాఠశాల రక్షణ కోసం గేట్లుకు బదులు ముళ్ల కంపలు అడ్డుపెట్టుకున్నారు. ఈ విషయంలో బిల్లులు చెల్లింపులు జరగక పోవడంతో ఇలా సగం పనులు చేసి విడిచిపెట్టామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అలాగే చేసిన పనులకు బిల్లులు కాకపోడంతో తెలుగు తమ్ముళ్లు గుర్రుగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.

సీజ్ చేసిన సారా, మద్యం ధ్వంసం



సీజ్ చేసిన సారా, మద్యం

కురుపాం: నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా సీజ్ చేసిన సారా, మద్యాన్ని విజయనగరం డిప్యూటీ కమిషనర్ వారి ఆదేశాల మేరకు పార్వతీపురం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 43 కేసులలో పట్టుబడిన 1456 లీటర్ల సారా, 47 కేసులలో పట్టుబడిన 52 లీటర్ల మద్యాన్ని కురుపాం పాత బస్టాంట్ సమీపంలో ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు. దసరా సందర్భంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే సారా ఎన్‌డీపీఎల్ లిక్కర్‌లపై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని, రాత్రి పూట స్పెషల్ స్క్వాడ్‌ల సహాయంతో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలు చేసే వారిపై 63029 36599 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



నడకతో సంపూర్ణ ఆరోగ్యం

పార్వతీపురం: పట్టణంలోని వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యుల ద్వారా గడచిన 20 ఏళ్లనుంచి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, మట్టి వినాయకులను పంపిణీ చేయడంతో పాటు సీతాకాలంలో వృద్ధులకు రగ్గులను, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. సంక్రాంతికి పేద మహిళలకు చీరలు, మగవారికి పంచెలు ఇచ్చి తమ సేవా కార్యక్రమాలను నిర్వహించి పలువురు మన్ననలను పొందుతున్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యంగా జీవించాలంటే నడక ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఏటా వాకర్స్ క్లబ్ జిల్లాస్థాయి సమావేశాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 5న జాతీయ స్థాయి వాకర్స్ క్లబ్ సమావేశాలను నిర్వహించేందుకు వాకర్స్ చీఫ్ కోఆర్డినేటర్, మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు పర్యవేక్షణలో సన్నాహాలు చేస్తున్నారు.

అక్టోబర్ 5న జాతీయ సమావేశం



పట్టణంలోని శ్రీ ఆర్యవైశ్య యిండుపూరు కల్యాణమంటపంలో అక్టోబర్ 5న జాతీయ సమావేశం నిర్వహిస్తున్నాం. ఈ సమావేశంలో అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతితోపాటు రీజనల్ కౌన్సిలర్లు, గవర్నర్లు పాల్గొంటారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ఆలోచనలు చేయనున్నాం. మొట్టమొదటిగా పార్వతీపురంలో ఏర్పాటు చేయనున్న ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలి.

– యిండుపూరు గున్నేశ్వరరావు, వాకర్స్ చీఫ్ కో ఆర్డినేటర్

– జామి నారాయణస్వామి, ఆర్గనైజర్, వాకర్స్ క్లబ్